క్లుప్తంగా

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి


కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే అచ్చ తెలుగు పండుగ సంక్రాంతి అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి బాటలో పయనిస్తూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి, కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

మహిళలకు చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న సారకాయలు, రామ్మూర్తి తదితరులు

నారాయణవనం: భోగి పండుగ పురస్కరించుకుని మండలంలోని వెత్తలతడుకు పంచాయతీ చిరంజీవి ఎస్టీ కాలనీ మహిళలకు శనివారం సర్పంచ్ రామ్మూర్తి చీరలను పంపిణీ చేశారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపీటీసీ రవి, పార్టీ నాయకుడు రాజా పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గొట్టుపూడి ఎస్టీ కాలనీ, కొండరాజుపల్లె గ్రామాల్లో ప్రజలకు నిత్యావసర సరుకుల కిట్లతో పాటు చికెన్, కోడిగుడ్లు, పిల్లలకు బిస్కెట్లు, చాక్‌లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బేబీ పి.హిత్రిక, బేబీ మైథిలి, మహేష్ నాయుడు, గాలి ధనుంజయ నాయుడు, పోలవరం సుబ్రహ్మణ్యం, సిహెచ్.రాము, పరుశురాం, నవీన్, శ్రావణ్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న గౌరవ్ మహేశ్వరి కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన గౌరవ్ మహేశ్వరి కుటుంబ సభ్యులు శనివారం రూ.50వేల విరాళాన్ని పాలకమండలి చైర్మన అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు.

కొత్త వీధిలైట్లు వేశారు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పీవీ కండ్రిగ, ఏ.పార్లపల్లె, కృష్ణాపురం, గ్రామాల్లోని వీధి లైట్లకు సర్పంచ్ కోటమ్మ మరమ్మతులు చేయించారు. వెలగని వీధిలైట్లను తొలగించి కొత్తవి అమర్చారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌పాల్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం ప్లీజ్!


సీపీఐ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

ఏర్పేడు: ఆరులేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. శనివారం మండలంలోని సీతారాంపేట వద్ద పొలాల్లో నిర్వాసితులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ, రైతులకు పరిహారం చెల్లించకనే వరి పంటలో రోడ్డు పనులకు పూనుకోవడం తగదన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారితో మాట్లాడి అక్కడి నుంచి పంపించేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకయ్య, జనమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు : కాళమనాయుడుపేటలో భోగి మంటలు వేస్తున్న యువకులు



రేణిగుంట : అమరరాజ కంపెనీలో యాజమాన్యం వేసిన భోగి మంటలు



పెద్ద పండుగొచ్చింది!

- ఘనంగా భోగి సంబరాలు
- రంగవల్లులుతో సంక్రాంతి లక్ష్మికి ఆహ్వానం


సత్యవేడు : గంగిరెద్దులకు దుస్తులు బహూకరించి ఆశీస్సులు పొందుతున్న మహిళ


ఏర్పేడు: భోగి మంటల వద్ద చిన్నారుల సందడి

సత్యవేడు/వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ/పిచ్చాటూరు/శ్రీకాళహస్తి/రేణిగుంట/ఏర్పేడు: సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని మండలాల వ్యాప్తంగా శనివారం భోగిపండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వీధుల కూడళ్లు, ఇళ్లముందు భోగిమంటలు వేశారు. చిన్నారులు భోగి పిడకలను మంటల్లో వేసి కచిత భస్మాన్ని నుదుట దిద్దుకున్నారు. చలిని సైతం లెక్క చేయకుండా తెల్లవారు జామునుంచే యువకులు కలప, దుంగలను పోగు చేసి వేసిన భోగి మంటల్లో నీళ్లు కాచి, తలస్నానం చేసి, కొత్త బట్టలు ధరించారు. మహిళలు ఇళ్లు, వాకిళ్లను సుందరంగా అలంకరించి, లోగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్ది, సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలల్లో ఉన్న వారు స్వగ్రామాలకు రావడంతో పల్లెలు ఉప్పొంగాయి. మండల కేంద్రాల్లో దుకాణాల వద్ద పూజాసామగ్రి, బట్టలు, సరుకుల కొనుగోళ్లతో రద్దీ నెలకొంది. పల్లెల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సంతోషంగా గడిపారు. పల్లెల్లో ఇళ్ల వద్ద గొబ్బెమ్మ పాటలు పాడుతూ గ్రామీణ మహిళలు, గంగిరెద్దులోళ్ల సందడి చేశారు. మహిళలు గంగిరెద్దులపై చీరలు కప్పి బసవన్న ఆశీర్వాదం పొందారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మూడు రోజుల పెద్ద పండుగను మరింత సంబరంగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

అమరరాజ కర్మాగారంలో..

రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజ కర్మాగారం ఆవరణలోని ఇంటి వద్ద అమరరాజ కర్మాగారం వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ గ్రూప్ ఎండీ గల్లా జయదేవ్, అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని, అమరరాజ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు గల్లా అశోక్, గల్లా సిద్ధార్థ, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య తదితరులు భోగి మంటలు వేసి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు.

పూడిలో క్రీడల సం'క్రాంతి'


తొట్టంబేడు: పూడిలో క్రీడాకారులతో ఏపీఐఐసీ వైస్ చైర్‌పర్సన్ గుమ్మళ్ల సృజన

తొట్టంబేడు (శ్రీకాళహస్తిరూరల్) : మండలంలోని పూడిలో శనివారం మూడు రోజుల సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ(ఏపీఐఐసీ) వైస్ చైర్‌పర్సన్ గుమ్మళ్ల సృజన మాట్లాడుతూ, తన స్వగ్రామంలో గ్రామస్తుల నడుమ పండుగ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ, పూడి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, ఖో-ఖో, చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు సృజన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ మాజీ కమిషనర్ బలరామయ్య, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బాలమురళి శ్రీనివాసులు న్యాయవాది రవితేజ గ్రామస్తులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి: తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1981–82లో టెన్త్ చదివిన విద్యార్థులు తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులు నాదముని, ఆనంద్, సుబ్రహ్మణ్యం, అంకమనాయుడు, రామసుబ్బారెడ్డి, మునిరత్నం, రుక్మిణి ఇళ్లకు వెళ్లి సన్మానించారు. వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్, మోహన్, కన్నన్, రాజవేలు, గోపాలకృష్ణ, ఆయూబ్, రవి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, సతీష్, పుత్తూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1998–99లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తాము 25 ఏళ్ల తరువాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

సుందరయ్యనగర్ దాహార్తి తీర్చిన ఎమ్మెల్యే


తాగునీటిని పట్టుకుంటున్న మహిళలతో మన్యం శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్ సుందరయ్యనగర్‌లోని తాగునీటి సమస్యను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి పరిష్కరించారు. యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్లు వేశారు. కుళాయిలను అమర్చి తాగునీటిని ప్రజలకు సరఫరా చేశారు. దీంతో మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకులెవ్వరూ తమ సమస్యలు పట్టించుకోలేదని, చెప్పిన వెంటనే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు తాము రుణపడి ఉంటామని వారు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చియ్యవరం పంచాయతీలోని కాలనీలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడి వీధుల్లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సిమెంట్ రోడ్లు వేశారు. అయితే మురుగు కాలువలు నిర్మించకపోడవంతో ఇళ్ల నుంచి బాత్రూముల నీరు, టాయిలెట్ల నీరు వీధుల్లో పిల్లకాలువల్లా ప్రవహిస్తూ దుర్గంధం చిమ్ముతున్నాయి. అసలే ఇరుకు వీధులు కావడం, మరోవైపు మురుగునీరు పారుతూండడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. సాయంత్రమైతే చాలు దోమలమోతతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఈకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలువురు గ్రామస్తులు మురుగునీటి కాలువల సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో అధికారులు త్వరితగతిన కాలువల నిర్మాణానికి పూనుకోవాలని పలువురు కోరుతున్నారు.

కవులకు సన్మానం


కవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెండ్లి మండపం వద్ద ఉన్న కైకాలవారి మండపంలో శనివారం కవి సమ్మేళనాన్ని శ్రీకాళహస్తీశ్వర లలిత కళాపరిషత్ నిర్వహించింది. పలువురు కవులు సంక్రాంతి మీద కవితాగానం చేశారు. కవి, ఉపాధ్యాయుడు, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంతోపాటు నెల్లూరు గాంధీ(గంగపుత్ర గాంధీ)ని సన్మానించారు. కార్యక్రమంలో గణేష్, వెంకటయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.